

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 166 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 28 అక్టోబర్ 2024 | వెల : 4/-



## మహిళాభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ

- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క
- వడ్డీ లేని రుణాలు ఇచ్చి మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతుంది
- ఈ ఏడాది మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ.25 వేల కోట్లు పంపిణీ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం
- మహిళలకు వడ్డీలేని రుణాలు ఇచ్చి బస్సులు కొనుగోలు చేయిస్తాం

ఖమ్మం

మహిళాభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలువనుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పాడిన ప్రజా ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇచ్చి మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతుందని చెప్పారు. ఈ ఏడాది మహిళలకు - మిగతా3లో

## మూసీకి పునరుజ్జీవం

# కల్పిద్దాం

- సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు
- హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవ సోదరుల పాత్ర కాదనలేనిది
- ఇక నుంచి ప్రతీ ఏడాది సదర్ సమ్మేళనం అధికారికంగా నిర్వహించాలని ఈ వేదిక నుంచి అధికారులకు ఆదేశాలు
- యాదవులు రాకీయంగా ఎదగాలని అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపించాం
- రాబోయే రోజుల్లో రాజకీయాల్లో యాదవ సోదరులకు సముచిత స్థానం కల్పిస్తాం
- ఈ నగరం అభివృద్ధి చేయడానికి యాదవ సోదరులు అండగా నిలబడాలి



హైదరాబాద్

మురికి కూపంగా మారిన మూసీకి పునరుజ్జీవం కల్పిద్దామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో తెలంగాణ సదర్ సమ్మేళనం జరిగింది. సదర్ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి - మిగతా3లో



## డిజిటల్ అరెస్టులపై అవగాహన అవసరం

- 'మన్ కీ బాత్'లో మోదీ
- సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఏ దర్యాప్తు సంస్థ కూడా ఫోన్ ద్వారా కానీ వీడియో కాల్ ద్వారా కానీ విచారణ చేపట్టదని స్పష్టం
- డిజిటల్ అరెస్టు బాధితుల్లో అన్ని వర్గాల వారు, అన్ని వయసుల వారు ఉన్నారు
- కష్టపడి సంపాదించుకున్న లక్షలాది రూపాయలు పోగొట్టుకున్న వాళ్లు కూడా చాలా మందే ఉన్నారు.



## ఉభయ సభల సంయుక్త సమావేశం

- నవంబరు 26న పార్లమెంటు ప్రత్యేక భేటీ
- భారత రాజ్యాంగాన్ని ఆమోదించి నవంబరు 26 నాటికి 75 వసంతాలు పూర్తి
- ఈ నేపథ్యంలో రాజ్యసభ, లోక్‌సభ ఉమ్మడి సమావేశం

## చంద్రయాన్-5 ప్రాజెక్ట్ చాలా భారీ మిషన్



- రానున్న సంవత్సరాలలో చంద్రయాన్-4, 5
- శాంపిల్ రిటర్న్ మిషన్ చంద్రయాన్-4 మరో రెండేళ్ల తర్వాత అంటే 2028లో ప్రారంభమయ్యే అవకాశం
- జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ జగ్జాతో చంద్రయాన్-5 మిషన్ ప్రయోగం
- రానున్న దశాబ్దంలో స్పేస్ ఎకానమీలో ప్రపంచ భాగస్వామ్యంలో భారత్ కనీసం10 శాతం మేర సహకారం
- అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్

# టార్గెట్... పదవులు

- మూడు ఎమ్మెల్సీ సీట్లు గెలవాల్సిందేనా?
- బీజేపీ నేతలకు టార్గెట్ ఫిక్స్ అయ్యిందా?
- వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాషాయపార్టీ అడుగులు
- టీ-బీజేపీ నేతలు దూకుడు పెంచారనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి
- స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. కాషాయ పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోందట.



హైదరాబాద్

తెలంగాణ బీజేపీ నేతలకు టార్గెట్ ఫిక్స్ అయ్యిందా? మూడు ఎమ్మెల్సీ సీట్లు గెలవాల్సిందేనా? స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా అడుగులు వేయనున్నారా? వీటిలో సక్సెస్ అయ్యినవారికే పదవులా? ప్రస్తుతం అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. బాహుబలి మూవీలో కాలకేయుడ్ని అంతం చేసిన వారికే.. మహిష్మతి సింహాసనం అప్పగించాలన్నది యువరాజులకు టార్గెట్ ఫిక్స్ చేశారు శివగామి. ఇదే పరిస్థితి తెలంగాణ బీజేపీ నేతల వంతైంది. తెలంగాణలో ప్రభుత్వ వైఫల్యాలని ఎండగట్టి.. వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాషాయపార్టీ అడుగులు - మిగతా3లో



## బెంగాల్‌లో శాంతి నెలకొనాలంటే సరిహద్దు చొరబాట్లు ఆగాలి

- సరిహద్దు చొరబాట్లను నిలిపివేస్తేనే పశ్చిమబెంగాల్‌లో శాంత నెలకొంటుందని
- 2026లో మార్పును కోరుకోండి. మేము ఈ చొరబాట్లకు అడ్డుకట్ట వేస్తాం.
- "సరిహద్దులు అతిక్రమణను అడ్డుకునేందుకు చట్టపరమైన మార్గం లేనప్పుడు అక్రమ వలసలు చోటుచేసుకుంటాయి.
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

## బీజేపీ మా సైద్ధాంతిక విరోధి...

## డీఎంకే మా రాజకీయ ప్రత్యర్థి

- రాజకీయ పార్టీ స్థాపించిన తమిళ హీరో విజయ్
- విల్లుపురం జిల్లాలో భారీ బహిరంగ సభ
- సమాజాన్ని విచ్ఛిన్నం చేసేవాళ్లే తమకు మొదటి శత్రువులన్న విజయ్
- డీఎంకేపై పరోక్ష విమర్శలు
- వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటన
- ఎంజీఆర్, ఎన్టీఆర్ స్ఫూర్తితోనే..రాజకీయాల్లో
- పెరియార్ ఈవీ రామసామి, కె. కామరాజ్, బాబాసాహెబ్ అంబేద్కర్, వేలు నాచియార్, అంజలై అమ్మాళ్ వేసిన బాటలోనే తమిళగ వెట్రి కజగం (టీవీకే) పయనిస్తుంది
- సినిమాల్లో హీరోగా నటిస్తూ తాను అత్యున్నత శిఖరాల్లో అధిరోహించారు
- తన ఈ రాజకీయ ప్రయాణంలో మహిళలు కీలక పాత్ర పోషించబోతున్నారు

2లో



# చంద్రయాన్-5 ప్రాజెక్ట్ చాలా భారీ మిషన్

**బెంగళూరు:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ సంస్థ భవిష్యత్ లక్ష్యాలను వెల్లడించారు. రానున్న దశాబ్దంలో స్పేస్ ఎకానమీలో ప్రపంచ భాగస్వామ్యంలో భారత్ కనీసం10 శాతం మేర సహకారం అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం భారత్ 2 శాతం మేర సహకారాన్ని అందిస్తోందని ఆయన చెప్పారు. అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా ఆకాశవాణిలో (ఆల్ ఇండియా రేడియో) చేసిన స్మారక ఉపన్యాసంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేసినట్టు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం పేర్కొంది. పెద్ద, చిన్న అనేక పరిశ్రమలు అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని వ్యక్తం చేస్తున్నాయని, వారిని భాగస్వామ్యం చేసేందుకు తగిన కృషి చేస్తామని చెప్పినట్టు తెలిపింది. ఈ కంపెనీలకు సహాయం, మార్గదర్శకత్వం చేస్తున్నామని సోమనాథ్ వెల్లడించారు. రానున్న సంవత్సరాలలో భారత్ చేపట్టనున్న అంతరిక్ష యాత్రల వివరాలను కూడా సోమనాథ్ వెల్లడించారు. అంతరిక్షానికి మనిషి పంపించే లక్ష్యంగా నిర్దేశించుకున్న మొట్టమొదటి మానవ సహిత మిషన్ 'గగన్‌యాన్'ను 2026లో చేపట్టే అవకావం ఉందని ఆయన చెప్పారు. శాంపిల్ రిటర్న్ మిషన్ చంద్రయాన్-4 మరో రెండేళ్ల తర్వాత అంటే 2028లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు.



**చంద్రయాన్-5పై కీలక ప్రకటన**

ఇక భారత్-అమెరికా సంయుక్తంగా చేపట్ట దలచిన నిసార్ మిషన్‌పై కూడా సోమనాథ్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ మిషన్‌ను వచ్చే ఏడాది ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ జగ్జాతో చంద్రయాన్-5 మిషన్ ప్రయోగం చేపట్టనున్నామని, ఇది మూన్-ల్యాండింగ్ మిషన్ అని వివరించారు. ఈ మిషన్ అసలు పేరు లుపెక్స్ లేదా 'లునార్ పోలార్ ఎక్స్‌ప్లోరేషన్' అని చెప్పారు. అయితే ఈ ప్రయోగాన్ని ఎప్పుడు చేపడతారన్న సమయాన్ని ఆయన వెల్లడించలేదు. అయితే ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 2025లో ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ఆ ప్రాజెక్టుని చంద్రయాన్-5గా సోమనాథ్ పేర్కొన్నారు కాబట్టి చంద్రయాన్-4 పూర్తయిన తర్వాత 2028లో చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

చంద్రయాన్-5 ప్రాజెక్ట్ చాలా భారీ మిషన్ అని, ఈ ప్రాజెక్టులో భారత్ ల్యాండర్ అందించనుండగా, జపాన్ రోవర్‌ను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. చంద్రయాన్-3లోని రోవర్ బరువు కేవలం 27 కేజీలే ఉండగా.. చంద్రయాన్-5లో రోవర్ బరువు ఏకంగా 350 కిలోలు ఉండనుంది.

# డిజిటల్ అరెస్టులపై అవగాహన అవసరం

**న్యూఢిల్లీ:** డిజిటల్ అరెస్టుల పేరుతో అమాయకులను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్న సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఏ దర్యాప్తు సంస్థ కూడా ఫోన్ ద్వారా కానీ వీడియో కాల్ ద్వారా కానీ విచారణ చేపట్టదని స్పష్టం చేశారు. దీన్ని గమనించి పోలీసులు, ఏజెన్సీల పేరుతో సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్న మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. 'మన్ కీ బాత్' 115వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి ఆదివారంనాడు ప్రసంగించారు. ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.



"డిజిటల్ అరెస్టు మోసాల కింద కాలర్లు తమను తాము పోలీసులుగా, సీబీఐ, ఆర్‌బీఐ, నార్కోటిక్స్ అధికారులుగా పరిచయం చేసుకుంటారు. చాలా నమ్మకంగా మాట్లాడతారు. ఈ విషయాన్ని 'మన్ కీ బాత్'లో మాట్లాడమని ప్రజలు నన్ను కోరారు. దీనిపై మీరు అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంది. మొదటి స్టెప్ మీ వ్యక్తిగత సమాచారం. కాలర్లు మొదట మీ సమాచారాన్ని రాబడతారు. భయం కలిగించడం రెండో స్టెప్. ఆలోచించే వ్యవధి కూడా ఇవ్వనంతగా భయపెడతారు. ఫలానా సమయం లోగా అంటూ ఒత్తిడి చేయడం మూడో స్టెప్. డిజిటల్ అరెస్టు బాధితుల్లో అన్ని వర్గాల వారు, అన్ని వయసుల వారు ఉన్నారు. కష్టపడి సంపాదించుకున్న లక్షలాది రూపాయలు పోగొట్టుకున్న వాళ్లు కూడా చాలా మందే ఉన్నారు. మీకు గనుక ఇలాంటి కాల్ ఏదైనా వస్తే అస్సలు భయపడవద్దు. ఏ దర్యాప్తు సంస్థ కానీ ఇలాటి ఫోన్, వీడియో కాల్స్ చేయదు" అని మోదీ తెలిపారు.

**రికార్డు చేయండి**

డిజిటల్ సెక్యూరిటీ కోసం 3 జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధాని తెలిపారు. "ఆగండి, ఆలోచించండి, చర్య తీసుకోండి" అనేవి మూడు స్టెప్స్ అని చెప్పారు. వీలుంటే స్క్రీన్ షాట్ తీసుకోండి, కాలర్ మాటలు రికార్డు చేయండి. ఏ ప్రభుత్వ సంస్థ కూడా ఫోన్లలో బెదిరించడం కానీ, డబ్బులు డిమాండ్ చేయడం కానీ ఉండదు.. అని ప్రధాని తెలిపారు. డిజటల్ అరెస్టుల పేరుతో ఎవరైనా భయపెడితే నేషనల్ సైబర్ హెల్ప్ లైన్ 1930కి ఫోన్ చేయాలని, సైబర్ క్రైమ్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. డిజిటల్ అరెస్టు అనేది చట్టంలో లేదని, ఇదొక మోసమని, నేరస్తులు చేసే పని అని ప్రధాని వివరించారు. ఇలాంటి మోసాలను అరికట్టేందుకు అన్ని దర్యాప్తు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నట్టు చెప్పారు. దర్యాప్తు సంస్థలు వేలాది వీడియో కాలింగ్ ఐడీలను, లక్షల్లో సిమ్ కార్డులు, మొబైల్ ఫోన్లు, బ్యాంక్ ఖాతాలను బ్లాక్ చేసినట్టు చెప్పారు. దర్యాప్తు సంస్థలు వాటి పని అవి చేసినప్పిటకీ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మోదీ వివరించారు.

# దుర్గ్గామాత ఆలయ పునరుద్ధరణంలో పాల్గొన్న కొలన్ సుభాష్‌రెడ్డి,నాలగూడెం మల్లారెడ్డిలు





**రాజేంద్రనగర్,అక్టోబర్ 27** హైదర్‌గూడ అతి పురాతన దుర్గ్గామాత ఆలయంలో కొలువుదీరిన అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కొలన్ సుభాష్ రెడ్డి, నారగూడెం మల్లారెడ్డిలు అన్నారు. హైదర్‌గూడ అతి పురాతన దుర్గ్గామాత దేవాలయ పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా గణపతి,నవగ్రహ పూజ,అభిషేకం,హెూమం చేసి గర్భాలయంలో ఉన్న పురాతన విగ్రహాన్ని గోమాత ద్వారా తీయడం వంటి పూజలను నిర్వహించారు. ఈ మేరకు ప్రత్యేకంగా మహేష్ పంతులు,భవాని పంతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మేడం రామేశ్వరరావులు,శెట్టిగారి వసంత రావు,సుజాత దంపతులు,శెట్టి గారి రమేష్, శెట్టిగారి నరేందర్,మొంద్ర నరసింహా,భక్త సమాజం అధ్యక్షులు బర్ల మల్లారెడ్డి,మొంద్ర కొమురయ్య, వనం నరసింహా,సవాద విజయ్ కుమార్,మ్యాడం జెవంత్,కుమ్మరి కళావతి,సిహెచ్ రవి,శ్రీను,కె.హరి, శ్రీశైలం,కరుణాకర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## టీ కాచి అందించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్.. వీడియో వైరల్



భోపాల్: మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ స్వయంగా టీ కాచారు. ఆయన వెంట ఉన్న కొందరికి ఆ టీ ఇచ్చారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సీఎం మోహన్ యాదవ్ ఆదివారం సాత్నాలోని చిత్రకూట్ ధామ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఒక టీ స్టాల్ వద్ద ఆయన ఆగారు. తాను టీ తయారు చేయవచ్చా? అని అక్కడున్న మహిళను అడిగారు. ఆమె సంతోషం వ్యక్తం చేయడంతో బారికేడ్ దాటి టీ స్టాల్ వద్దకు వెళ్లారు. టీ కోసం అల్లం దంచారు. టీ స్టాల్ మహిళ పేరు అడగ్గా 'రాధ' అని ఆమె చెప్పింది. కాగా, సీఎం మోహన్ యాదవ్ ఎప్పుడైనా మీ కోసం టీ చేశారా అని ఆయన భార్య సీమా యాదవ్‌ను అక్కడున్న వారు అడిగారు. దీనికి సమాధానం చెప్పాలని మోహన్ యాదవ్‌తో ఆమె అన్నది. 'ఆమె నా సోదరి, నువ్వు కాదుగా, సోదరుడు సోదరికి టీ తాగిస్తాడు' అని అన్నారు. ఆ తర్వాత టీ అమ్మే మహిళకు డబ్బులు ఇచ్చారు. కప్పుల్లో టీ పోసి అక్కడున్న వారికి అందజేశారు. అనంతరం స్థానిక ఉత్పత్తులను కూడా ఆయన కొనుగోలు చేశారు. డిజిటల్ మోడ్‌లో చెల్లించారు. సీఎం మోహన్ యాదవ్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## బీజేపీ మా సైద్ధాంతిక విరోధి... డీఎంకే మా రాజకీయ ప్రత్యర్థి



**చెన్నై, అక్టోబర్ 27:** తనను సినిమా ఆర్టిస్ట్ అంటూ కొందరు పేర్కొంటున్నారని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ తమిళ హీరో విజయ్ పేర్కొన్నారు. అయితే తమిళనాట ఎంజీఆర్.. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారని ఈ సందర్భంగా విజయ్ గుర్తు చేశారు. ఆదివారం విళుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని వి.సాలైలో మహానాడును విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మహాసభకు లక్షలాది మంది ప్రజలు, విజయ్ అభిమానులు పోటెత్తారు. ఈ సందర్భంగా హీరో విజయ్ మాట్లాడుతూ.. పెరియార్ ఈవీ రామసామి, కె. కామరాజ్, బాబాసాహెబ్ అంబేద్కర్, వేలు నాచియార్, అంజలై అమ్మాళ్ వేసిన బాటలోనే తమిళగ వెట్రి కజగం (టీవీకే) పయనిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు. సినిమాల్లో హీరోగా నటిస్తూ తాను అత్యున్నత శిఖరాల్లో అధిరోహించానన్నారు. అలాగే అత్యధిక పారితోషకం తీసుకుంటూ.. మీ అందరిని నమ్మి రాజకీయాల్లోకి వచ్చానని హీరో విజయ్ వెల్లడించారు. తన ఈ రాజకీయ ప్రయాణంలో మహిళలు కీలక పాత్ర పోషించబోతున్నారని తెలిపారు. అయితే నీట్ సమస్య కారణంగా చనిపోయిన అరియలూరు విద్యార్థిని అనిత ఆత్మహత్యను ఈ సందర్భంగా హీరో విజయ్ గుర్తు చేసుకున్నారు. ఈ ప్రసంగంలో భాగంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకేతోపాటు కేంద్రంలోని బీజేపీపై విజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే ఈ సభ ప్రారంభంలో హీరో విజయ్ ప్రసంగాన్ని ప్రారంభిస్తూ.. రాజకీయాల్లో మనం చిన్నపిల్లలమంటూ చాలా మంది వ్యాఖ్యానించారన్నారు. కానీ మనం ఆత్మవిశ్వాసంతో రాజకీయం అనే పాముతో ఆడుకునే పిల్లలమని అభివర్ణించారు. తమిళనాడు అసెంబ్లీకి 2026లో ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో తమను భారీ మెజార్టీతో గెలిపిస్తారని ప్రజలపై తమకు అచంచలమైన విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. ఒక వేళ పార్టీలు తమతో పొత్తు పెట్టుకోవాలనుకుంటే వారికి ప్రభుత్వంలో భాగస్వామిని చేస్తామని టీవీకే అధినేత, హీరో విజయ్ స్పష్టం చేశారు.

## ఉభయ సభల సంయుక్త సమావేశం

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం నవంబరు 26న పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి నవంబరు 26 నాటికి 75 వసంతాలు పూర్తవుతున్న నేపథ్యంలో రాజ్యసభ, లోక్‌సభ ఉమ్మడి సమావేశం జరగనుంది. ఈ మేరకు శనివారం కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. నవంబరు 26న పార్లమెంటులోని సంవిధాన్ సదాన్‌లో ఉభయ సభల సంయుక్త సమావేశం జరగనుందని అధికారులు తెలిపారు. 1949 నవంబరు 26న భారత రాజ్యాంగాన్ని ఆమోదించగా 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. కాగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125వ పుట్టిన రోజు 2015 ఏప్రిల్ 14 సందర్భంగా నవంబరు 26ను జాతీయ న్యాయదినోత్సవంగా కేంద్రం ప్రకటించింది.

## 'నరకాసురుడిలా జీవించండి'.. ఉదయనిధి దీపావళి శుభాకాంక్షలపై బీజేపీ స్పందన



**చెన్నై:** తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అయితే 'విశ్వాసం ఉన్నవారికి' అంటూ ట్విస్ట్ ఇచ్చారు. డీఎంకే ప్లాటినం జూబ్లీ వేడుకల నేపథ్యంలో ఉదయనిధి స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మన (డీఎంకే) ప్లాటినమ్ జూబ్లీ వేడుకలకు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. అలాగే విశ్వాసంతో జరుపుకునే వారికి 'దీప ఒలి తిరునాల్' (దీపావళి శుభాకాంక్షలు)' అని అన్నారు. బీజేపీ నేత నారాయణన్ తిరుపతి దీనిపై స్పందించారు. 'నమ్మకం లేని వారు నరకాసురుడిలా జీవించాలని నా శుభాకాంక్షలు' అంటూ ట్వీట్ చేశారు. కాగా, రాముడు అరణ్యవాసం పూర్తి చేసి సీతాదేవితో అయోధ్యకు తిరిగి రావడానికి సూచనగా ఉత్తరాది భారత్‌లో దీపావళిని జరుపుకుంటారు. అయితే రాక్షస రాజైన నరకాసురుడిపై శ్రీకృష్ణుడు, సత్యభామ సాధించిన విజయానికి గుర్తుగా దక్షిణ భారతీయులు దీపావళిని జరుపుకుంటారు. మరోవైపు 'హేతువాద' విశ్వాసాలకు అనుగుణంగా వ్యవహరించే డీఎంకే నేతలు సాధారణంగా పండుగ శుభాకాంక్షలు చెప్పేందుకు దూరంగా ఉంటారు. దివంగత నేత ఎం కరుణానిధి కూడా ఎప్పుడూ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు చెప్పలేదు. అయితే దీనికి భిన్నంగా డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. 'విశ్వాసం ఉన్నవారికి' అంటూ ట్విస్ట్ ఇచ్చారు. కాగా, హిందువుల పండుగలను విస్మరిస్తున్నారంటూ డీఎంకేపై బీజేపీ తరచుగా మండిపడుతున్నది.

## బెంగాల్‌లో శాంతి నొలకొనాలంటే సరిహద్దు చొరబాట్లు ఆగాలి




**కోల్‌కతా:** బంగ్లాదేశ్ నుంచి ఇండియాకు అక్రమ వలసలతో దేశంలో శాంతికి విఘాతం కలుగుతోందని కేంద్ర హెూమంత్రి అమిత్‌షా ఆందోళన వ్యక్తం చేశారు. సరిహద్దు చొరబాట్లను నిలిపివేస్తేనే పశ్చిమబెంగాల్ లో శాంత నెలకొంటుందని అన్నారు. బెంగాల్‌లో ఇండియా-బంగ్లాదేశ్ సరిహద్దుల వెంబడి పెట్రాపోల్ ల్యాండ్ పోర్ట్ వద్ద కొత్త ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని ఆయన ఆదివారంనాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026లో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలకు కళ్లెం వేస్తామని హామీ ఇచ్చారు. "సరిహద్దులు అతిక్రమణను అడ్డుకునేందుకు చట్టపరమైన మార్గం లేనప్పుడు అక్రమ వలసలు చోటుచేసుకుంటాయి. అక్రమ వలసలు ఇండో-బంగ్లాదేశ్ శాంతికి విఘాతం. బెంగాల్ ప్రజలకు నేను ఒక విషయం చెప్పదలచుకున్నాను. 2026లో మార్పును కోరుకోండి. మేము ఈ చొరబాట్లకు అడ్డుకట్ట వేస్తాం. చొరబాట్లు ఆగిపోతేనే బెంగాల్‌లో శాంతి సాధ్యం" అని అమిత్‌షా స్పష్టం చేశారు. పెట్రాపోల్ ల్యాండ్ పోర్ట్ వద్ద టెర్మినల్ భవన నిర్మాణానికి రూ.500 కోట్లు వెచ్చించారు. బెంగాల్‌లో శాంతిని నెలకొల్పేందుకు ల్యాండ్ పోర్టులు చాలా ముఖ్యమని అమిత్‌షా ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య కనెక్టివిటీ, సత్సంబంధాల మెరుగుగు ల్యాండ్ పోర్టులు అవసరమని అన్నారు. ఇందువల్ల ఉభయదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కూడా బలోపేతమవుతాయని చెప్పారు. బెంగాల్ అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంపుతున్న నిధులను టీఎంసీ ప్రభుత్వం దోచుకుంటోందని ఆయన ఆరోపించారు. గత పదేళ్ల ఎన్డీయే హయాంలో బెంగాల్‌కు రూ.56,000 కోట్లు ఇచ్చిందని, ఆ సొమ్ము ఎన్ఆర్ఈజీఏ లబ్దిదారులకు ఇచ్చారా? తృణమూల్ కాంగ్రెస్ వర్కర్ల చేతుల్లోకి వెళ్లిపోయాయా? అని తాను ఈరోజు ప్రశ్నిస్తున్నానని అన్నారు. దీనిపై దయచేసి ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. 2026లో రాజకీయ మార్పును రాష్ట్రంలో తీసుకురావాలని ప్రజలకు అమిత్‌షా పిలుపునిచ్చారు.

## ఢిల్లీ మార్కెట్‌లో చైనీస్ మొబైల్ ఫోన్ జామర్లు.. షాపు ఓనర్ అరెస్ట్



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని మార్కెట్‌లో చైనీస్ మొబైల్ ఫోన్ జామర్లను పోలీసులు గుర్తించారు. భద్రతకు ముప్పు కలిగించే వీటిని అక్రమంగా అమ్మేందుకు ఉంచిన ఆ షాపు యజమానిని అరెస్ట్ చేశారు. పాలికా బజార్‌లోని షాపు యజమాని రవి మాథుర్‌కు ఈ పరికరాలను విక్రయించడానికి లైసెన్స్, తగిన పత్రాలు లేవని పోలీసులు తెలిపారు. అతడ్ని ప్రశ్నించగా ఢిల్లీలోని లజ్‌పత్ రాయ్ మార్కెట్ నుంచి రూ. 25,000 చొప్పున రెండు చైనా తయారీ మొబైల్ ఫోన్ జామర్‌లను కొనుగోలు చేసినట్లు చెప్పారు. వాటిని అధిక ధరకు విక్రయించేందుకు షాపులో ఉంచాడని పోలీసులు వివరించారు. దీని గురించి టెలికమ్యూనికేషన్ విభాగానికి సమాచారం అందించినట్లు తెలిపారు. ఢిల్లీలోని ఇతర మార్కెట్లలో కూడా సోదాలు నిర్వహిస్తామని వెల్లడించారు. కాగా, మొబైల్ ఫోన్ జామర్లు 50 మీటర్ల వరకు మొబైల్ సిగ్నల్స్‌కు అంతరాయం కలిగిస్తాయి. ఇన్‌కమింగ్, అవుట్‌గోయింగ్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, సమీపంలోని అన్ని సెల్యూలర్ యాక్టివిటీస్‌ను నిరోధిస్తాయి. అలాగే ఆ ప్రాంతంలోని అన్ని మొబైల్స్ నెట్‌వర్క్‌ను, యాక్టివ్ కాల్స్‌ను బలవంతంగా డిస్‌కనెక్ట్ చేస్తాయి. దీంతో మొబైల్ ఫోన్లలో 'నో నెట్‌వర్క్' గుర్తు కనిపిస్తుంది. మరోవైపు ఈ జామర్ల వల్ల నేరాలు జరిగిన ప్రాంతాల్లో ఎలాంటి కమ్యూనికేషన్ జరిగిందో అన్నది పోలీసులు ట్రాక్ చేయలేరు. ఈ నేపథ్యంలో భద్రతకు ముప్పు కలిగించే వీటిని అనధికార వ్యక్తులు వినియోగించడం, విక్రయించడాన్ని నిషేధించారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం నిర్దిష్ట లైసెన్స్, పత్రాలు కలిగిన అధీకృత ప్రభుత్వ, రక్షణ శాఖ అధికారులు మాత్రమే మొబైల్ జామర్లు వినియోగించేందుకు అనుమతి ఉంటుంది.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసిన డాక్టర్ మోహన్ నాయక్






**రామాయంపేట,అక్టోబర్27(సూర్యరేఖ)** రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన సావిత్రి రోడ్డు ప్రమాదంలో గురువారం సాయంత్రం మృతి చెందింది. వీరి కుటుంబంలో పెద్దదిక్కు కోల్పోవడం వల్ల చిన్నపిల్లలు అనాథలుగా మారిన విషయం తెలుసుకున్న డాక్టర్ మోహన్ నాయక్ వెంటనే స్పందించి ఆ కుటుంబానికి పరామర్శించి బాసటగా నిలిచారు.వారి కుటుంబానికి 25 కిలోల బియ్యం బస్తా, రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.అదేవిధంగా ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన బాలరాజ్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఈ విషయం నీలా గ్రూప్ చైర్మన్ సభ్యుల ద్వారా తెలుసుకున్న ఆయన ఆ కుటుంబాలకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో రాయిలాపూర్,ప్రగతి ధర్మారం గ్రామస్తులు పాల్గొన్నారు.

## 4 రియల్ కంపెనీలకు అమోయ్ లబ్ది?

**హైదరాబాద్ :** అమోయ్ కుమార్ కు మరో షాక్ తగిలింది. మాజీ సీనియర్ కలెక్టర్‌పై మరో భూకుంభకోణం ఫిర్యాదు తెరపైకి వచ్చింది. సుమారు రూ.1000 కోట్ల విలువ చేసే ల్యాండ్‌ని అమోయ్ కుమార్ దోచేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా తట్టి అన్నారం గ్రామంలోని మధురానగర్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్స్ హైదరాబాద్‌లోని ఈడీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో ఈడీ అధికారులు ఫోకస్ చేశారు. ఇక మరో వైపు రంగా రెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని వట్టినాగుల వల్లి, కాజాగూడా లోని పలు ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అన్యాయంగా అప్పగించారని ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌పై బాధితులు ఆరోపిస్తున్నారు.మొత్తం నాలుగు రియల్ ఎస్టేట్ కంపెనీలకు లబ్ధి చేకూరూలేగా అమోయ్ కుమార్ ల్యాండ్ కేటాయింపు జరిపాడని బాధితులు చెబుతున్నారు. ఈ ల్యాండ్ కబ్జాల వెనుక బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల హస్తం ఏమైనా ఉందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ల్యాండ్ కబ్జాల ద్వారా లబ్ధి పొందిన డబ్బంతా ఎక్కడికి వెళ్లిందన్న కోణంలో విచారణ జరుగుతుంది.

# అపూర్వ సమ్మేళనం.. వెల్లి విరిసిన ఆనందం.!!

**శంకర్ పల్లి,అక్టోబర్ 27(సూర్యరేఖ)** రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం జనవాడలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 21 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా జనవాడ ట్యాగ్ గ్రీన్ ఫీల్డ్ పంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి,వారికి పాదాభివందనం చేసి పూలమాలు,శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం తమతో పాటు చదువుకొని మృతి చెందిన తమ మిత్రులకు ఘనంగా నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు ఉదయం నుండి సాయంత్రం వరకు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని,ఒకరినొకరు ఆత్మీయంగా పలక




రించుకున్నారు.తాము చదువుకున్న పాఠశాలకు మరమత్తులు ఇతర అభివృద్ధి పనులకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు.

# ఆ టీచర్లకూ ఓటు హక్కు కల్పించాలి!

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు టీచర్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. త్వరలో తెలంగాణాలో రెండు (కరీంనగర్, నల్గొండ), ఏపీలో రెండు (ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర) టీచర్ ఎంఎల్‌సీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఈ డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రధానంగా పనిచేస్తున్నది సెకండరీ గ్రేడ్ టీచర్లే కాబట్టి, తమకు ఓటు హక్కు కల్పించాలని వారు గట్టిగా కోరుతున్నారు. ఓటు హక్కు లేకపోవడం వల్లనే టీచర్ ఎంఎల్‌సీలు తమను పట్టించుకోవడం లేదని వారు ఆవేదనతో ఉన్నారు. వారి ఆవేదనలో అర్థం లేకపోలేదు. తెలంగాణలో పదివేల ఎస్జీటీ పోస్టులను ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం ఒప్పుకొని ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఉత్తర్వులు రాలేదు. ఈ విషయాన్ని ఎంఎల్‌సీలు ఏనాడూ సీరియస్‌గా తీసుకోలేదని ఎస్జీటీలు వాపోతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిభారం విపరీతంగా ఉం దని, మెజారిటీ ప్రాథమిక పాఠశాలల్లో ఒక ఎస్జీటీ పద్దెనిమిది సబ్జెక్టులు బోధించవలసి వస్తోందని అంటున్నారు. అయినా టీచర్ ఎంఎల్‌సీలు స్పందించడం లేదని, శాసనమండలిలో సమస్యను లేవనెత్తడం లేదని గుర్రుగా ఉన్నారు. తరగతికి ఒక టీచర్ ఉండేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం లేదని వారు బాధపడుతున్నారు. ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోవడం వల్లనే టీచర్ ఎంఎల్‌సీలు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వారి భావన. తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్, సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ తదితర ఉపాధ్యాయ సంఘాలు, టీచర్ ఎంఎల్‌సీలతో సహా పలు రాజకీయ పార్టీలు ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ఓటు హక్కు కల్పించే విషయమై పలుమార్లు వివిధ స్థాయిల్లో రిప్రజెంట్ చేశాయి. దీనిపై తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ స్పందిస్తూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అక్టోబర్ 21, 2024 నాడు జారీ చేసిన లేఖ నం.30/ఎల్‌సీ/2024/ ఈఆరెస్‌లో పేర్కొన్న మార్గదర్శకాల ప్రకారం ఓటర్ లిస్టు లు ప్రిపేర్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారులుగా కూడా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు అక్టోబర్ 22, 2024 నాడు మెమో నం. 7300/ఎలెక్స్.బి/బి1/2024-3 జారీ చేశారు. కాగా, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950 ప్రకారం అర్హులైన టీచర్లతో ఓటర్ల జాబితాలు రూపొందించాలని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా 21న జారీ చేసిన లేఖలో స్పష్టంగా పేర్కొంది.

టీచర్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందడానికి ఉండాల్సిన అర్హతలను ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950లో పేర్కొన్నారు. ది రిప్రజెంటేషన్ ఆఫ్ ద పీపుల్ యాక్ట్, 1950



సెక్షన్ 27(3)(బి) ప్రకారం టీచర్ ఎంఎల్‌సీ ఎన్నికల కోసం అర్హులైన టీచర్లతో ఓటర్ల జాబితాలు రూపొందించాల్సి ఉంది. ఈ యాక్ట్ ప్రకారం సెకండరీ స్కూల్ (ఉన్నత పాఠశాల) కంటే తక్కువకాని విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రమే టీచర్ ఎంఎల్‌సీ ఎన్నిక ల్లో ఓటు హక్కు ఉంటుంది. సూటిగా చెప్పాలంటే, హైస్కూల్ ఆపై ఉన్నత విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లకు మాత్రమే టీచర్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న లక్షలాది మంది టీచర్లకు ఓటు హక్కు లేదు. తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ అక్టోబర్ 22 నాడు జారీ చేసిన తాజా మెమోలో తేల్చి చెప్పిన విషయమూ ఇదే. ఎప్పుడో ఏడు దశాబ్దాల క్రితం రూపొందించిన ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950లో టీచర్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఓటు హక్కుకు అర్హతలు నిర్దేశించారు. వాటిని ఇప్పటికీ సవరించకపోవడమే సమస్యకు అసలు కారణం. దేశానికి స్వాతంత్రం సిద్ధించిన తొలినాళ్లలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే టీచర్ల విద్యార్హతలు కేవలం ఏడవ తరగతి మాత్రమే. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఉన్నత విద్యార్హతలతో నియామకమై, హైస్కూల్ ఆపై ఉన్నత విద్యా సంస్థల్లో పనిచేసే టీచర్లకు మాత్రమే అప్పుడు టీచర్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించారు. కానీ, గడిచిన డెబ్భై ఏళ్లలో పరిస్థితి పూర్తిగా మారింది. ప్రస్తుతం ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్ల కనీస విద్యార్హతే ఇంటర్మీడియట్ ప్లస్ డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్. డాక్టరేట్, పీజీలు వంటి ఉన్నత విద్యార్హతలు ఉన్నవారు సైతం వేలల్లో పనిచేస్తున్నారు. ఈ మార్పులను పరిగణనలోకి తీసుకొని ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950ని వెంటనే సవరించాలి. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లపై ఉన్న వివక్షను తొలగించాలి. వారికి టీచర్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి. ఇది ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూళ్లలో పనిచేస్తున్న లక్షలాది మంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశం కాబట్టి, రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. విడివిడిగా కాకుండా, సంఘాలు ఉమ్మడి కార్యాచరణ ప్రారంభించాలి. సమస్యను ఇరు రాష్ట్రాల సీఎంలకు వివరించాలి. అసెంబ్లీలో తీర్మానం చేయించి కేంద్ర ప్రభుత్వానికి పంపించమని కోరాలి. అసెంబ్లీ తీర్మా నం చేస్తే, సమస్యకు ప్రాధాన్యత పెరిగి, కేంద్రం సత్వరం స్పందించే అవకాశం ఉంటుంది. దీంతో పాటు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, ఎంపీలను కలిసి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేలా ఒత్తిడి తేవాలి. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950కి సవరణలు పెద్ద కష్టతరమైన పనేం కాదు. కేవలం సింపుల్ మెజారిటీతో సవరణలు చేయవచ్చు. గతంలో చాలాసార్లు సవరణలు జరిగాయి కూడా. కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించాలి. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న లక్షలాది మంది టీచర్ల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. వారికి ఓటు హక్కు కల్పించేందుకు చట్ట సవరణ చేయడానికి సత్వరం చర్యలు ప్రారంభించాలి.

# సంపాదకీయం

# ఎట్టకేలకు దిగొచ్చిన చైనా

నాలుగేళ్ల ప్రతిష్టంభన ముగిసింది. భారత్ చైనాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఎల్ఏసీలో ఇరు సైన్యాల మధ్య ఇకపై ఘర్షణలు ఉండవనే ఆశ మళ్లీ మొగ్గతొడిగింది. భారత్, చైనా రైవల్రీ ఆటలో హాల్ట్ రావడంతో రెండు దేశాల మధ్య వాతావరణం చల్లారిందనే సూచనలు కనిపిస్తున్నాయి. 40 మంది ప్రాణాలు తీసిన నాలుగేళ్ల నాటి ఘర్షణకు తర్వాత ఇది ఇరు దేశాల సంబంధంలో కీలక ముందుడుగేనని చెప్పాలి..భారత్ ? చైనా మధ్య వాస్తవాధీన రేఖ వెంబడి తూర్పు లడఖ్‌లో దాదాపు నాలుగేళ్లు సైనిక ప్రతిష్టంభనను ముగించడానికి ఇరు దేశాల మధ్య ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందం ప్రకారం నియంత్రణ రేఖ వద్ద ఇరు దేశాల బలగాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైంది. తూర్పు లద్దాఖ్ సెక్టార్ లోని కీలక ప్రాంతాలైన డెస్పాంగ్, డెమ్చొక్ నుంచి కొన్ని తాత్కాలిక సైనిక స్థావరాలను, తాత్కాలిక నిర్మాణాలను ఇరు దేశాలు తొలగిస్తున్నాయని రక్షణ వర్గాలు తెలిపాయి. బలగాల ఉపసంహరణ ప్రక్రియ అంతా పూర్తయిన తరువాత మరో నాలుగైదు రోజుల్లో ఈ రెండు ప్రాంతాల్లో పెట్రోలింగ్ ను పునరుద్దరించనున్నట్లు తెలుస్తోంది.తూర్పు లడఖ్‌లోని గల్వాన్ లోయలో 2020 జూన్ 15న భారత్ ? చైనా సైనికుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘర్షణలో ఇరవై మందికిపైగా భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సరిహద్దులో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీంతో ఎల్ఏసీ వెంబడి ఇరు దేశాలు భారీగా సైనిక బలగాలను మోహరించాయి. అక్కడ తాత్కాలిక నిర్మాణాలు, సైనిక స్థావరాలను ఏర్పాటు చేశాయి. ఎల్ఏసీ సరిహద్దుల్లో ఉద్రిక్తత వాతావరణాన్ని తగ్గించేందుకు ఇరు దేశాల సైనిక అధిపతుల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినా సఫలం కాలేదు.ఇరుదేశాల మధ్య ఇటీవల ఒప్పదం కుదిరింది. రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో ఈ ఒప్పందాన్ని భారత్ ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ధ్రువీకరించారు. దీంతో వాస్తవాధీన రేఖ వెంబడి 2020 గల్వాన్ ఘర్షణకు ముందు నాటి యథాస్థితి కొనసాగనుంది. ఇక నుంచి 2020లో గస్తీ నిర్వహించిన సైనికులు పెట్రోలింగ్ పాయింట్లకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఒకవైపు స్నేహ హస్తం చూపిస్తున్నట్లే చూపించి, మరో చేత్తో గన్ గురిపెట్టే బుద్ధి చైనాది. అందుకే, ఇప్పుడు ఈ అనుమానాలు. 1962లో జరిగిన భారత్ చైనా యుద్ధం తర్వాత చైనా ఓవరాక్షన్ చాలా సార్లు హద్దు మీరింది. 1975 నుండీ సరిహద్దులో ఎన్నో సార్లు ఆక్రమణలకు పాల్పడింది. భారత్ సహనాన్ని అవకాశంగా తీసుకొని రెచ్చిపోయింది. అయితే, నాలుగేళ్ల క్రితం 40 మందిని బలితీసుకున్న గాల్వాన్ లోయ ఘర్షణలతో అది పీక్స్‌కెళ్లింది. కట్ చేస్తే.. ఇప్పుడు, రెండు దేశాలూ ‘బోర్డర్ పెట్రోల్ ఒప్పందానికి’ వచ్చాయి.అక్టోబర్ 22 నుండి 24 వరకూ రష్యాలో బ్రిక్స్ సదస్సులో భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌లు మాట్లాడుకునే అవకాశం ఉందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. నాలుగేళ్లుగా తూర్పు లడఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి సైనిక ప్రతిష్టంభనను పరిష్కరించే ప్రయత్నాలలో ఈ ఒప్పందం కీలకమైన పురోగతిగా కనిపిస్తోంది. ఈ ఒప్పందంతో.. భారత్, చైనా మధ్య వాస్తవాధీన రేఖలో పెట్రోలింగ్ నిర్వహించే హక్కులను పునరుద్ధరించడానికి రెండు దేశాలూ అంగీకరించాయి. దీనితో, లడఖ్‌కు ఉత్తరాన ఉన్న డెప్సాంగ్ మైదానాలు, దక్షిణాన డెమ్‌చోక్ ఎల్ఏసి వెంబడి, పాత పెట్రోలింగ్ పాయింట్ల వరకు పెట్రోలింగ్ నిర్వహించుకోవచ్చు. అంటే డేప్సాంగ్ మైదానాల్లో, డెమ్‌చోక్‌లోని చార్డింగ్ నుల్లాలో పెట్రోలింగ్ పాయింట్ వరకు భారత సైనికులు పెట్రోలింగ్ చేయొచ్చు. ఇక, ఈ ఒప్పందంలో భాగంగానే, తూర్పు ప్రాంతంలో, ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని సున్నితమైన ప్రదేశాలకు సంబంధించి కొన్ని పరస్పర ఒప్పందాలు కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది.నాలుగేళ్ల క్రితం, 2020లో ఘర్షణలు చోటుచేసుకున్న గాల్వాన్ వ్యాలీ, పాంగోంగ్ త్సో పాయింట్లను రెండు సంవత్సరాల క్రితం బఫర్ జోన్‌లు ఏర్పాటు చేసి, దళాలను విడదీశారు. గతంలో ఇక్కడ పెట్రోలింగ్ చేసే సైనికులు 13 నుండి 18 మంది ఉండగా.. ఘర్షణను నివారించడానికి కనీసం 14 నుండి 15 మంది సైనికులు గస్తీలో ఉంటారని నిర్ణయించారు. ఇక, ఇప్పుడు, ఇరుపక్షాల పెట్రోలింగ్ పరస్పరం మార్చుకోడానికి ఒప్పందం కుదిరింది. పెట్రోలింగ్ చేసే క్రమంలో రెండు వైపుల నుండీ సమన్వయం ఉంటుందనీ.. ఒకరికొకరు సమాచారం ఇచ్చిపుచ్చుకుంటాయని ఒప్పందంలో పొందుపరిచారు. ఇందులో భాగంగా, నెలవారీ ప్రాతిపదికన, కేస్-టు-కేస్ ఆధారంగా కమాండర్, కో-కమాండర్ స్థాయి సమావేశాలు కూడా నిర్వహించాలని ఒప్పందంలో పేర్కొన్నారు. ఇప్పటివరకు కుదిరిన అవగాహన ప్రకారం, డెప్సాంగ్‌లోని కీలక ప్రాంతాల నుండి చైనా దళాలు ఉపసంహరించుకుంటాయి. అయితే, ఇది లడఖ్‌లో రాబోయే తీవ్రమైన శీతాకాల ప్రణాళికలో భాగమేనని కొన్ని వర్గాలు చెబుతున్నాయి.2020లో గల్వాన్ లోయలో చోటుచేసుకున్న ఘర్షణ తర్వాత భారత్-చైనా దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే సరిహద్దుల వెంబడి ఇరువైపులా భారీగా బలగాలను మోహరించాయి. దాదాపు 68 వేల మంది సైన్యాన్ని భారత్ సరిహద్దుకు పంపించింది. సరిహద్దుల్లో డ్రాగన్ సైన్యం ఏదైనా కవ్వింపులకు పాల్పడితే.. దానికి దీటుగా స్పందించేందుకు ఇండియన్ ఆర్మీ అన్నివిధాలా సిద్ధమైంది. అయితే, ఈ సమస్యకు పరిష్కారం కోసం ఆర్మీ కమాండర్ స్థాయిలో గత నాలుగేళ్లుగా చర్చలు జరుగుతూనే ఉండగా.. తాజాగా కీలక పురోగతి కనిపించింది. దీనితో, అంతర్జాతీయ ఫోరమ్‌లలో రెండు దేశాల మధ్య ఉన్నత-స్థాయి దౌత్య చర్చలు సులభతరం అవుతాయి. అలాగే, ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడతాయి. దీనితో పాటు, సరిహద్దులో భారత్ చేస్తున్న మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆటంకం కలగకుండా ఉంటుంది. ఇక, చైనా విషయానికొస్తే, ఇతర ప్రపంచ ఉద్రిక్తతల మధ్య భారతదేశంతో సరిహద్దు వివాదాలను తగ్గించడం దానికి వ్యూహాత్మక లాభమనే చెప్పాలి.

# ఆపదలో ఉన్న వారికి అండగా..





**ఆర్థిక సాయంలో ముందుండి..**
**సేవా కార్యక్రమంలో..ముందున్న యువకుడు ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షులు**
**మన్నె సాయిచరణ్**



**కొల్చారం,అక్టోబర్27(సూర్యరేఖ)** ఆపదలో ఉన్న వారికి అండగా..యువతకు నిదర్శనంగా.. ప్రజల్లో గుండెల్లో నిలుస్తూ..ప్రజాసేవకై పనిచేస్తూ..కొల్చారం మండలానికి నిదర్శనంగా.. పనిచేస్తున్న యువ నాయకుడు,ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షుడు సాయి చరణ్ అని చెప్పుకోవచ్చు.. మానవత్వానికి మరో పేరుగా..ప్రజల మన్ననలు పొందుతూ ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షుడు మన్నే సాయి చరణ్ ను నిలుస్తున్నాడు. కొల్చారం మండలం సంగాయిపేట్ గ్రామానికి చెందిన 23 సంవత్సరాల యువ కిరణం ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. శ్రీ దుర్గా భవాని మాత భక్తుడిగా అమ్మవారి అనుగ్రహం తో ఎంఎస్ఆర్ యువసేనను ఏర్పాటు చేసి తన సొంత డబ్బులతో సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నాడు. ఇటీవల సంగాయిపేట్ గ్రామంలో మృతి చెందిన పలు కుటుంబాలకు రూ.5 వేల నుంచి 10 వేల చొప్పున బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రంగంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత షెడ్డు నిర్మాణానికి రూ.50 వేలు, పోతంశెట్టిపల్లిలో దుర్గా భవాని మాత కమిటీ సభ్యులకు రూ.30 వేలు, వెంకటాపూర్ దుర్గాభవాని కమిటీ సభ్యులకు రూ.20 వేలు, అప్పాజీపల్లి దుర్గాభవాని కమిటీ సభ్యులకు రూ.25 వేలు తన వంతు విరాళంగా అందజేసి అందరి మన్ననలు పొందుతున్నాడు. రంగంపేట గ్రామంలో ఏర్పాటు చేస్తున్న చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ఎంఎస్ ఆర్ యువసేన తరపున ఒక లక్ష 11 వేల 111 రూపాయలను విరాళంగా ప్రకటించారు. కొల్చారం మండల వ్యాప్తంగా గ్రామ గ్రామాన సాయిచరణ్ పేరు మార్మోగుతుంది. ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా ఇంత మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి సాయి చరణ్ కు ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డిని, నర్సాపూర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని కలిసినప్పటికీ తనకు రాజకీయాల పట్ల ఎటువంటి ఆసక్తి లేదని తెలిపారు. దుర్గా భవాని మాతకు వీర భక్తుడనని భవిష్యత్తులో ఎంఎస్ఆర్ యువసేన తరుపున మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని పేర్కొన్నారు.

# పేరుకు కిరాణం.. అమ్మేది మద్యం సీసాలు..!




**గ్రామాల్లో ఎనీ టైం మద్యం అవలేబుల్..**
**పల్లెల్లో బార్లను తలపిస్తున్న బెల్ట్ షాపులు..**
**సెలవు దినాల్లో జోరుగా విక్రయాలు..**
**పచ్చని సంసారాల్లో మద్యం చిచ్చు..**
**పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు..**

**పెద్దపల్లి,అక్టోబర్27(సూర్యరేఖ):** పెద్దపల్లి జిల్లాలోని మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతోంది. పల్లెలు,మారుమూల గ్రామాలు రాత్రింబవళ్లు మత్తులో జోగుతున్నాయి. గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు.అనేక మంది బెల్ట్ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధి పాలవుతున్నాయి.జిల్లాలో అధికారిక వైన్ షాపుల్లో నిత్యం వచ్చే మద్యం ప్రియులకు ఎంఆర్పీ ధరకు అమ్మకాలు చేస్తున్నారు. విచ్చలవిడిగా పెరుగుతున్న బెల్ట్ షాపు నిర్వాహకులు క్వార్టర్ పై రూ.30,హాఫ్ పై రూ.60 ఫుల్ బాటిల్ పై రూ.120 బీర్ పై రూ.40 అదనంగా వసూలు చేస్తున్నారు.వైన్స్ షాపుల్లో ఉండే ప్రతి ఒక బ్రాండ్ మద్యం బెల్ట్ షాపుల్లో ఉండటం గమనార్హం..ప్రతి ఒక్క గ్రామంలో వీధి వీధికి బెల్ట్ షాపులు వెలుస్తున్నాయి.అంటే అధికారులే పరోక్షంగా బెల్ట్ షాపుల నిర్వాహకులను పెంచి పోషించినట్లుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామాల్లో ఎనీ టైం అందుబాటులో మద్యం..**

పట్టణ ప్రాంతాల్లో రాత్రి సమయంలో మద్యం దొరుకదు కానీ మండల కేంద్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏ మధ్య రాత్రి అయిన బెల్ట్ షాప్ తలుపు తట్టితే మందు దొరుకుతుంది.పలు గ్రామాలలో ఎక్కువ మంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు.సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిడ్జ్ లో పెట్టుకుని మరీ విక్రయిస్తున్నారు. మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు మద్యం ప్రియులు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల కారణంగా మద్యం ఏరులై పారుతోంది.

**పచ్చని సంసారాల్లో మద్యం చిచ్చు..**

విచ్చలవిడిగా గ్రామాల్లో దొరుకుతున్న మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతోంది.ఊరూరా బెల్టుషాపులు పుట్టగొ డుగుల్లా వెలుస్తున్నాయి.దీంతో పొద్దంతా పని చేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు.గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తుండ టంతో యువత పెడదారి పడుతోంది.ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

**సెలవు దినాల్లో జోరుగా విక్రయాలు..**

స్వతంత్ర,గణతంత్ర,గాంధీ జయంతి తదితర సెలవు రోజుల్లో ముందు రోజే బెల్ట్ షాపుల నిర్వాహకులు ఆటోలలో లక్షల విలువ చేసే మద్యం స్టాక్ తీసుకుని వచ్చి సెలవు దినాల్లో ఎలాంటి భక్తి,భయం లేకుండా



మద్యం విక్రయాలను సాగిస్తున్నారు.ఇదంతా సాగుతున్న సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల జిల్లా మండల గ్రామాల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**బెల్టు షాపులను అరికట్టాలి..**

రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్టు షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.మద్యంకు బానిసై కుటుంబాలు చిన్నభిన్నమై రోడ్డున పడుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్టు షాపులను అరికట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు..

**అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత..**
**మంథని ఎస్సై దేగ రమేష్**



**మంథని,పెద్దపల్లి(సూర్యరేఖ)** మంథని గోదావరి,మానేరు నదుల నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను శనివారం రాత్రి పట్టుకున్నట్లు మంథని ఎస్సై దేగ రమేష్ తెలిపాడు.మండలంలోని గోదావరి,మానేరు నదుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలోని విలోచవరం గ్రామానికి చెందిన కోరవేణి శ్యాంసుందర్,చిన్న ఓదాల గ్రామానికి చెందిన మోతుకు రాజబాబు లు గోదావరి నది నుండి అక్రమంగా మానేరు నుండి ఇసుకను తన ట్రాక్టర్ తో అక్రమంగా తరలిస్తున్నారని సమాచారంతో తమ సిబ్బంది వారి టాక్టర్లను పట్టుకున్నారని తెలిపారు.వాటిపై కేసు నమోదు చేశామని,మంథని మండలలో అక్రమ ఇసుక తరలించేవారు పద్ధతి మార్చుకోవాలని,ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ.రమేష్ హెచ్చరించారు.

## కామారెడ్డి మున్సిపాలిటీని కైవసం చేసుకుంటాం..

**శాసనసభ్యులు తాటిపల్లి వెంకటరమణారెడ్డి**



**కామారెడ్డి,అక్టోబర్ 27( సూర్యరేఖ)** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత ఓదేశాన్ని విశ్వ గురువుగా చేయాలన్నదే నరేంద్ర మోడీ కల అని కామారెడ్డి శాసనసభ్యులు తాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు.ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన 15 వార్డు భారత రాష్ట్ర సమితి నాయకుడు భూమేష్ యాదవ్ తో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన 21 మంది నాయకులు వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో బిజెపిలో చేరారు. అనంతరం పార్టీలో చేరిన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ...రాబోయే ఎన్నికల్లో కామారెడ్డి మున్సిపాలిటీని భారతీయ జనతా పార్టీ కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. యువత మొత్తం నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరుస్తూ 10 కోట్ల మంది బిజెపి సభ్యులుగా చేరారని గుర్తు చేశారు.కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాల్లో భారతీయ జనతా పార్టీ బలోపేతం అయిందని ఆయన తెలిపారు.ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.పార్టీలో చేరిన బీఆర్ఎస్ భూమేష్ యాదవ్ మాట్లాడుతూ. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి నాయకత్వంలో పనిచేస్తూ భారతీయ జనతా పార్టీ మలోపేతానికి తన వంతు కృషి చేస్తానని,రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కామారెడ్డి మున్సిపల్ పై కాషాయ జెండా ఎగరవేస్తామని అన్నారు.15వ వార్డులో అందర్నీ కలుపుకొని పార్టీ కోసం పని చేస్తానని భూమేష్ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు కాసర్ల శ్రీనివాస్, అవధూత నరేందర్, మోటూరి శ్రీకాంత్ గుప్తా,పట్టణ అధ్యక్షులు ఆకుల భరత్,తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కోర్సుల ప్రవేశాలలో ప్రైవేటు సంస్థల మాయాజాలం లో పడొద్దు..

**వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులతి**



**రాజేంద్రనగర్,అక్టోబర్ 27** తెలంగాణా రాష్ట్రంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒక్కదానికే 'ఏ గ్రేడ్ 'తో కూడిన 'ఐకార్' గుర్తింపు ఉందని ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య స్పష్టం చేశారు.విద్యార్థులు,తల్లితండ్రుల ప్రయోజనార్థం ఈ ప్రకటన జారీ చేస్తున్నట్లు తెలిపారు.గుర్తింపులేని ప్రైవేటు కళాశాలలతో వర్సిటీకి ఎలాంటి సంబధం లేదని ఆయన స్పష్టం చేశారు.వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీట్లు ఇప్పిస్తామని ప్రచారం చేసుకునే దళారుల మాటలు విద్యార్థులు,వారి తల్లిదండ్రులు నమ్మి మోసపోవద్దని తెలిపారు.అలాంటి వ్యక్తులు,సంస్థలతో విశ్వవిద్యాలయానికి ఎలాంటి సంబంధం, భాగస్వామ్యం లేదని వివరించారు.ప్రవేశాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు, తల్లితండ్రులకి ఆయన సూచించారు.ఇటీవల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కోటాలో ఫీజులు భారీగా తగ్గించడమే కాకుండా...సీట్లు కూడా పెంచామని..పెంచిన సీట్లను కౌన్సెలింగ్ ద్వారా ప్రతిభ ఆధారంగానే వ్యవసాయ విశ్వవిద్యాలయం రెగ్యులర్,ప్రత్యేక కోటాలో ప్రవేశాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.ఎటువంటి మధ్య దళారీలు, కన్సల్టెంట్ ల పైన ఆధార పడవద్దని,వారి మాయ మాటలని నమ్మ వద్దని ఉపకులపతి మరోసారి సూచించారు.ఇతర అనధికారిక వెబ్ సైట్ లలో లభ్యం అయ్యే సమాచారానికి విశ్వవిద్యాలయానికి సంబంధం లేదని తెలిపారు.పెంచిన ప్రత్యేక కోటాసీట్ల భర్తీ కోసం ప్రస్తుతం ఆన్లైన్ లో దరఖాస్తులు నవంబర్ 1వ తేదీ వరకు స్వీకరిస్తున్నామని..ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ప్రవేశాలకి సంబంధించిన సమాచారం కొరకు తల్లితండ్రులు, విద్యార్థులు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్ సైట్ మాత్రమే చూడవలసిందిగా ఉప కులపతి జానయ్య సూచించారు.

# కోనంపేట ప్రజల దశాబ్దాల కళ..నెరవేరిన వేళ





**నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా..**

**రూ.43 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యేగడ్డంవినోద్**

**బెల్లంపల్లి,అక్టోబర్ 27 (సూర్యరేఖ)** నెన్నెల మండల కేంద్రంలోని మన్నెగూడెం నుంచి కోనంపేట వరకు రెండు కోట్ల 43 లక్షల బీటీ రోడ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధికారులతో కలిసి ఆదివారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరై భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని మండలాలలోని సమస్యలన్నీటిని అంచలంచెలుగా పరిష్కరిస్తూ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామన్నారు. అనంతరం నెన్నెల మండలంలోని మన్నెగూడెం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ పనులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు, పాల్గొన్నారు.

# మతోన్మాద దోపిడీ విదానాలకు ప్రత్యామ్నాయం మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానమే





**వర్గ సామాజిక ఐక్యతకు నికరంగా నిలబడి పోరాడేది ఎంసిపిఐ (యు)మాత్రమే..**

**ఎంసిపిఐ (యు) పార్టీ జిల్లాకార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్**

**బెల్లంపల్లి,అక్టోబర్27(సూర్యరేఖ)** దేశంలో పెట్రేగిపోతున్న మతోన్మాద దోపిడి విధానాలకు ప్రత్యామ్నాయం మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానమే ఏకైక మార్గమని, అందు కోసం నికరంగా నిలబడి ముందుకు సాగుతున్న పార్టీ ఎంసిపిఐ(యు)మాత్రమే అని ఎంసిపిఐ (యు)పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎంసిపీఐ (యు) మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలో పార్టీ జిల్లాసహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ అధ్యక్షతన ప్రస్తుత రాజకీయాలు, మార్క్సిజం, అంబేద్కర్ ఆలోచన విధానం అనే అంశంపై ఎంసిపిఐ (యు) వ్యవస్థాపకులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ 16వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో వారి స్మారక స్థూపం వద్ద వారి చిత్రపటానికి పార్టీ,ప్రజా సంఘాల నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లాకార్యదర్శి సబ్బని రాజేం ద్రప్రసాద్, సభ అధ్యక్షులు పసులేటి వెంకటేష్ మాట్లాడు తూ...77 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో ఆకలి, దారిద్రం, నిరుద్యోగం, ఆత్మ హత్యలు, అత్యాచారాలు,హింసతోపాటు కుల-మత బేధాలు, ప్రాంతీయ తత్వాలను పాలకవర్గాలు అనైతిక రాజకీయ విధానాలతో పెంచి పోషిస్తున్నాయన్నారు. సెక్యులర్ పేరు తో కాంగ్రెస్ పార్టీ దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన ఆర్థిక దోపిడితో పాటు కులమత తత్వాలను పెంచి పోషించిందని, బీఎస్ఎస్ భావజాలంతో మూడోసారి కేంద్రాన్ని పాలిస్తున్న బిజెపి కూడా తన మత భావాజాలన్నీ పెంపొందించు కుంటూ మైనార్టీ మతాలపై, దళిత,గిరిజన, అట్టడుగు వర్గాలపై మనువాద పాలన పేరుతో దాడులకు పూను కుంటూ వస్తుందని,గత పాలకవర్గం లాగానే కార్పొరేట్, పెట్టుబడుదారి వర్గాలకు దేశ సంపదను ఆదాని, అంబానీల కు కట్టబెట్టిందని,తన మతోన్మాద పెట్టుబడుదారి, ఆర్థిక విధానాలను ప్రశ్నించిన వారిపై పాసీజంతో దురాహంకార పూరితమైన ఉన్మాదా చర్యలకు పూనుకుంటుందన్నారు. ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థ లాంటి స్వతంత్ర వ్యవస్థల ను తన గుప్పిట్లో పెట్టుకొని దేశ రాజకీయ వ్యవస్థలను కలుషితం చేస్తుందని ఆరోపించారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నదని, ఒకే దేశం,ఒకే మతం,ఒకే భాష అంటూ ఒకే ఎన్నికల పేరుతో జమిలి ఎన్నికల విధానానికి ఒడిగట్టి ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ విలువలను సమాధి చేస్తుందని మండిపడ్డారు. అనేక ఆంక్షల నేపథ్యంలో సాధించుకున్న మన తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన గత బీఆర్ఎస్,ప్రస్తుత కాంగ్రెస్ కూడా రాష్ట్ర అభివృద్ధి పేరుతో కేంద్రంలోని బిజెపి చేసిన తప్పుడు చట్టాలను ప్రజా వ్యతిరేక విధాలను బలపరుస్తున్నాయని కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న పాసిస్ట్,మనువాద విధానాలకు, సెక్యులర్ ముసుగులో ఉన్న కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా కార్పొరేట్,పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను కొనసాగిస్తున్న దోపిడి వర్గాల పాలనలో సమస్త హక్కులు కోల్పోతున్న శ్రామిక వర్గ ఐక్య పోరాటాల బలోపేతానికి మార్క్సిజమే మార్గదిశగా, తరతరాలుగా అసమానలతో అణిగిమనిగి ఉన్న భారత సమాజాన్ని అంబేద్కర్ ఆలోచన విధానంతో నిర్మూలించే దిశగా రాజకీయ ఆర్థిక సామాజిసమానత్వాన్ని బహుజనులకు రాజ్యాధికారాన్ని సాదించేందుకు ఎంసిపిఐ (యు) పార్టీ ముందుండి పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,మండల కార్యదర్శి సతీష్,మహిళ సమాఖ్య నాయకులు కాంపల్లి రాధ,దుర్గం లక్ష్మి,కామెర పద్మ,యువజన,విద్యార్థి నాయకులునరేష్, శేఖర్, సాయి, రాం, మహేష్, ఆకాష్, అరుణ్ వివిధ మండలాల నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పోస్ట్ ఆఫీస్ లో కోటి రూపాయల డిపాజిట్లు స్వాహా

**నకిలీ పాస్ పుస్తకాలు అందజేత..**

**చేతివాటం ప్రదర్శించిన పోస్ట్ ఆఫీస్ ఉద్యోగి హేమ.**


**ఉన్నతాధికారుల విచారణ..**

**పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేటలో ఘటన..**



**పెద్దపల్లి,అక్టోబర్27(సూర్యరేఖ)** కాయ కష్టం చేసుకొని పోస్ట్ ఆఫీస్ లో డిపాజిట్ల రూపంలో దాచుకున్న కోటి రూపాయలకు పైగా నగదును కాజేసి ఖాతా దారులకు నకిలీ పత్రాలు అందజేసిన సంఘటన పెద్దపెల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట పోస్ట్ ఆఫీస్లో చోటుచేసు కుంది.నకిలీ పత్రాల వల్ల పోస్టాఫీస్ లో డిపాజిట్లు గల్లంతు కావడం చర్చనీయాంశంగా మారింది.బాధితుల ఫిర్యాదుతో స్పందించిన పోస్టల్ అధికారులు విచారణ మొదలుపెట్టారు.ప్రజల నుంచి లక్షలాది రూపాయలు డిపాజిట్లు చేయించుకున్న పోస్టుమాస్టర్ హేమ సదరు డబ్బులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డిపాజిటర్లకు నకిలీ పాస్ పుస్తకాలు, రశీదులు ఇచ్చారు.మోసపోయినవారిలో దాదాపు 50 మంది బాధితులు ఉన్నట్లు సమాచారం.ఈ విషయం వెలుగులోకి రావడంతో బాధితులంతా పోస్టల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు అధికారులు బేగంపేట పోస్టాఫీస్కు చేరుకొని విచారణ చేపట్టారు.ప్రస్తుతం 50 లక్షల వరకు సదరు ఉద్యోగిని మోసాలకు పాల్పడినట్లు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తెలుస్తోంది.గుండ శ్రీను అనే బాధితుడు 2017లో తన కూతురు శ్రీవర్ష పేరుతో పీఎం జీవన్ సమృద్ధి యోజన కింద చెల్లించగా ప్రస్తుతం 13లక్షల 83 వేలు జమ కావలసి ఉండగా మొత్తం జమ కాలేదని వాపోయారు.అలాగే కైలాస పద్మ అనే మహిళ కట్టిన డబ్బుల ప్రకారం రూ. 12 లక్షల రూపాయలకు నకిలీ పాస్పుస్తకం,నకిలీ రశీదులు ఇచ్చినట్లు వాపోయింది.బాధితులందరూ పోస్ట్ ఆఫీస్ వద్ద ఆందోళన తెలియజేశారు.పూర్తిస్థాయి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోస్టల్ ఇన్స్పెక్టర్ తెలియ జేశారు.

## సైక్లింగ్ రేసింగ్ లో యువకులు



**నిజాంపేట,అక్టోబర్27(సూర్యరేఖ)** ఉరుకుల పరుగుల జీవితాలలో వ్యాయామం ఎంతో ముఖ్యమని వైద్య నిపుణులు చెబుతున్నప్పటికీ రోజు రోజుకు వ్యాయామంపై ఆదరణ చూపుతున్నారు.ఈ మేరకు ఆదివారం తెల్లవారుజామున రామాయంపేట నుండి నిజాంపేట వరకు రామాయంపేట పట్టణ యువకులు సైకిలింగ్ రేసింగ్ లో పాల్గొన్నారు. అలాగే నిజాంపేట మండల కేంద్రానికి చెందిన యువకులు నిజాంపేట నుండి భూంపల్లి మండలం కూడవెల్లి వరకు సైక్లింగ్ చేపట్టారు.ఈ రోజుల్లో ఆరోగ్యవంతులుగా ఉండేందుకు వాకింగ్,సైక్లింగ్,రన్నింగ్,ఓపెన్ జిమ్, కరాటే, లాంటివిఎంతో దోహద పడతాయన్నారు. యువత తమ తమ ఆరోగ్యలపై దృష్టి సారించడం వాకింగ్ సైక్లింగ్ లో పాల్గొనడంతో పలువురు అభినందిస్తున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించిన డాక్టర్ మోహన్ నాయక్..



**నిజాంపేట,అక్టోబర్27,సూర్యరేఖ** మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన మెట్టు శాల బాలరాజ్ (47) ఇటీవల గుండెపోటుతో మరణించడం జరిగింది. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ మోహన్ నాయక్ ఆదివారం మృతిని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు తోపాటు25కేజీ బియ్యాన్ని అందజేశారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలోరాజు నాయక్,రాంజీ నాయక్, సుభాష్ నాయక్, నాజం నాయక్, మురళి, రవి, తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేటలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ




**నిజాంపేట,అక్టోబర్27(సూర్యరేఖ)** మండల కేంద్రంలో ఆదివారం ఎస్సై శ్రీనివాస్ రెడ్డి ఆదేశానుసారం హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రోడ్డుపై ప్రయాణించే వాహన దారులు తప్పకుండా సీట్ బెల్ట్ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సాయిబాబా,నవీన్,తదితరులు పాల్గొన్నారు.

## నిజాం వారసత్వ భూములను ప్రభుత్వ భూమిగా తప్పుడు ప్రచారం చేయడం తగదు..

**అది మా పూర్వీకుల నుండి సంక్రమించిన పట్టాభూమి..**

**కొందరు వ్యక్తులు తమ భూమిలో నుండి 3000 చదరపు గజాల భూమి ఇవ్వాలని బెదిరింపు...**

**వలియుద్దీన్ ఖాన్**



**రాజేంద్రనగర్,అక్టోబర్ 27** శంషాబాద్ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 626/1 లోని ప్రైవేట్ భూమిని ప్రభుత్వ భూమి అని దుష్ప్రచారం చేయడం సరి కాదని ఎన్.ఎం. వలియోద్దీన్ ఖాన్,అతని న్యాయవాది మీర్ అహ్మద్ ఖాన్ తో కలిసి స్పష్టం చేశారు.శంషాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 626/1లో తమకు 12 ఎకరాల నాలుగు గుంటల భూమి ఉన్నదని వలియోద్దీన్ స్పష్టం చేశారు .ఈ భూమి తాత ముత్తాతల నుండి తమకు వారసత్వంగా సంక్రమించిందని ఆయన కోర్టు ఆర్డర్ ను చూపించారు.సర్వే నంబర్ 626/1 లో దాదాపు 340 ఎకరాలు చూపిస్తున్న వలియోద్దీన్ భూమిని గతంలో కూడా స్వాధీనం చేసుకున్నదని తెలిపారు.కాగా తమకు చెందిన 12 ఎకరాల నాలుగు గంటల భూమిని మాత్రం హుడా అధికారులు స్వాధీనం చేసుకోలేదని తెలిపారు.దీనికి సంబంధించి హుడా అధికారులు జారీ చేసిన పంచనామా పత్రాలను చూపించారు.ఈ భూమికి సంబంధించి రెవెన్యూ, హెచ్ఎండిఏ అధికారులతో తమకు కోర్టులో కేసు నడుస్తున్నదని వివరించారు. కొందరు వ్యక్తులు తమ భూమిలో నుండి 3000 చదరపు గజాల భూమి ఇవ్వాలని బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. ఎందుకు తాము అంగీకరించకపోవడంతో ఈ స్థలం ప్రభుత్వాన్నిదని దుష్ప్రచారం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.తమను బెదిరిస్తూ ఇది ప్రభుత్వ భూమి అని దుష్ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వలియోద్దీన్ ఖాన్,మీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.కరుణాకర్ రెడ్డి, పెద్ద రాము,శేఖర్ గుప్త,కుమార్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు వెల్లడించారు.వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# హైదరాబాద్ సదర్ కార్యక్రమానికి హాజరైన ఓబిసి స్టేట్ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్





**బెల్లంపల్లి,అక్టోబర్27(సూర్యరేఖ)** టిపిసిసి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ల ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్ టి ఆర్ స్టేడియంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సదర్ కార్యక్రమానికి యాదవ్ సంఘం రాష్ట్ర నాయకులు,టిపిసిసి సెల్ రాష్ట్ర ఓబీసీ వైస్ చైర్మన్,బెల్లంపల్లి13వ వార్డు కౌన్సిలర్ బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నుండి సుమారు10 వాహనాలలో నాయకులు, కార్యకర్తలతో హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ. రాష్ట్రంలో యాదవ సోదరులకు సముచిత స్థానం కల్పిస్తున్నామని,యాదవుల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు,ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పథంలో ముందుకు నడవాలని ముఖ్యమంత్రి తెలిపారని ఆయన సూచించారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో యాదవ సోదరులకు సముచితం స్థానం కల్పించనున్నట్లు వెల్లడించారన్నారు. యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుని స్మరించుకుంటు దీపావళి పండుగకు ముందు నిర్వహించే ఈ పవిత్ర కార్యక్రమానికి తాను హాజరవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని ప్రభాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,శాసనసభ స్పీకర్ గడ్డం అశోక్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

# కంటిచూపు సమస్య ఎవరికీ రానివ్వను..





**సమస్యలు ఉన్నవారికి వైద్యం చేయించే బాధ్యత నాది..**
**మా తల్లి పుట్టి బాలమణి జ్ఞాపకార్థం, ఈ సేవా కార్యక్రమాలు..**
**సంఘ సేవకుడు పుట్టి సందీప్ ముదిరాజ్**

**రామాయంపేట,అక్టోబర్27(సూర్యరేఖ)** తన తల్లి జ్ఞాపకార్థం తాను పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రామాయంపేట పట్టణానికి చెందిన పుట్టి సందీప్ ముదిరాజ్ అన్నారు.ఇందులో భాగంగా ఆదివారం రామాయంపేట ఆరవ వార్డులో కంటి సమస్యలతో బాధపడుతున్న 20 మందిని కామరెడ్డి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.వారికి ఎలాంటి పైసా ఖర్చు లేకుండా తన సొంత డబ్బులతో వాహనాల్లో ఇంటి వద్ద నుండి తీసుకెళ్లి కామారెడ్డి కంటి ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు తానే స్వయంగా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎక్కువ లోపం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి ఆపరేషన్లు అవసరమైతే కూడా తానే డబ్బులు చెల్లించి చేయించడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు.స్త్రీ ఎక్కడ గౌరవించబడి పూజించబడుతుందో అక్కడ అందరూ సంతోషంగా ఉంటారని ఆయన అన్నారు.తాను తన తల్లి జ్ఞాపకార్థం గతంలో పట్టణంలో కూడా ఉచిత వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఉచితంగా నీటిని సరఫర కూడా చేయడం జరిగిందని తెలిపారు.సందీప్ చేస్తున్న పనులకు పట్టణ ప్రజలతో పాటు ఎన్నారైలు సైతం మెచ్చుకోవడం, అభినందించడం జరుగుతుంది.ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం జరుగుతుందని,పట్టణంలో ఎవరైనా కంటి సమస్యలు ఉంటే తనను సంప్రదించాలని ఆయన కోరారు.మహిళా వృద్ధురాళ్లకు దానికి సంబంధించిన కంటి పరీక్షలు కళ్ళజోళ్ళు వైద్యం మాత్రలు చేయించడం జరిగినది. నవంబర్ ఆరవ తేదీన నలుగురు వృద్ధురాలకు సొంత ఖర్చుతో ఆపరేషన్ చేయించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అల్లాడి శ్యామ్, రాజు,బీర రాము, మంగలి భరత్,తదితరులు పాల్గొన్నారు.

# పోరాజ్ పల్లి పిలదెల్ఫియా ప్రార్థన మందిరంలో క్రైస్తవ ఉపవాస దీక్షలు








**36వ రోజు ఉపవాస ప్రార్థన ఆరాధనలో సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరామ్**
**బోర్న్ విటా,ఎనర్జీ డ్రింక్స్,మ్యాగి మసాల ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేసిన డాక్టర్ జానకిరామ్**

**కొల్చారం,అక్టోబర్ 27( సూర్యరేఖ)** క్రైస్తవులు 40 దినములు ఉపవాస దీక్షలు చేసి ఏసు క్రీస్తును ఆరాధించి తరిస్తున్న తీరు అద్భుతం, అమోఘం,అపూర్వం,అనంతం అని సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరామ్ అన్నారు.ఆదివారం తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పోతరాజ్ పల్లిలోని పిలదేల్ఫియా చర్చ్ లోని క్రైస్తవులు 36 వ ఉపవాస ప్రార్థన ఆరాధన కార్యక్రమంలో డాక్టర్ జానకిరామ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.అనంతరం బ్రదర్స్ కు,సిస్టర్స్ కు క్యాడ్ బరిస్ బోర్న్ విటా,మిక్స్ డ్ ఫ్రూట్ జ్యూస్ ప్యాకెట్లు,వాటర్ బాటిళ్లు,మ్యాగి మసాల ప్యాకెట్లు శఫ్ఫార్డ్ స్వచ్ఛంధ సంస్థ అధినేత రొయ్యూరి సురేష్ సహకారంతో డాక్టర్ జానకిరామ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ. పిలదెల్ఫియా ప్రార్థనా మందిరంలో దాదాపు 200 మంది క్రైస్తవ సోదర,సోదరీమణులు 40 రోజుల ఉపవాస దీక్ష చేస్తూ ఏసు నామస్మరణతో అత్యంత పరమ పవిత్రమైన కఠోర దీక్షతో ఉపవాస దీక్ష చేస్తున్న వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఏసు ప్రభువు పేరుతో ఉండే ఉపవాస దీక్షతో దేవుడు అనుగ్రహం లభించడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు కూడా నయమై దేవుని బిడ్డలుగా సేవ చేయడానికి మరింత శక్తి వస్తుందన్నారు.అనంతరం బిన్నీ ఫాస్టర్ మాట్లాడుతూ.




సీనియర్ జర్నలిస్ట్ జానకిరామ్ కు డాక్టరేట్ పట్టా రావడం మా అందరికీ ఆనందంగా, సంతోషంగా ఉందని అన్నారు. జానకిరామ్ కుటుంభం ఆ ఏసు ప్రభువు దీవెనలతో ఆయు రారోగ్యాలతో,అష్ట ఐశ్వర్యాలతో ఇంకా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫాస్టర్ బెన్నీ,శ్రీలత లతో పాటు బ్రదర్ కుమార్ ప్రభాకర్, లక్ష్మణ్, ప్రవీణ్, ఏసుదాస్,విజయ్ కుమార్ సుబ్బారావు,నరేష్, హొసన్నా ,ప్రదీప్, అనంతరావు, సాయి, శేఖర్, వినయ్, రమేష్, దేవిడ్, మహేష్, శ్రీశైలం, సిస్టర్స్ సుశీలమ్మ, ఇందిరమ్మ, పుణ్యవతి, మహేశ్వరి, లక్ష్మి, సమాధానం, మరియమ్మ, సుసన్న, రజిత, లక్ష్మి,కృప జ్యోతి, విజయ, శోభ, ఎలమంద,తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా నిలుస్తున్న..

**నాయిని వెంకట్ గౌడ్ (గజిని)**



**కొల్చారం,అక్టోబర్ 27(సూర్యరేఖ)** అప్పాజీపల్లి గ్రామ మాజీ సర్పంచ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు,మండల గౌడ సంఘం అధ్యక్షులు, నాయిని సునీత వెంకట్ గౌడ్ (గజిని) నిరుపేదలకు అండగా నిలుస్తూ ఆపద్బాంధవుడులా తనకు తగిన ఆర్థిక సహాయం అందజేస్తూ బాసటగా నడుస్తున్నారు. అప్పాజీపల్లి గ్రామస్తుడైన పిచ్చకుంట్ల లక్ష్మయ్య గత రెండు రోజుల క్రితం మెదక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న నాయిని సునీత వెంకట్ గౌడ్ మృతుడు లక్ష్మయ్య అంత్యక్రియలు పాల్గొన్నారు. అనంతరం ఆయన అంత్యక్రియలకు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఆయన వెంట చింతల కిషన్, తిమ్మకపల్లినర్సింలు.పిచ్చకుంట్ల నర్సింలు, బాగాయాల పోచయ్య,తదితరులు ఉన్నారు.

## ఎంపీ నిధులతో చీదేడ్ వీధిలైట్ల పంపిణీ..



**ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 27(సూర్యరేఖ)** గ్రామాభివృద్దే తమ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బైరీక రమాకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మంచాల మండల పరిధిలోని చిదేడ్ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సహకారంతో ఎంపీ నిధుల కింద వీధిలైట్లను అందించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నిరంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. బడుగు,బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు.రాబోయే రోజుల్లో పేదలందరికీ రేషన్ కార్డులు,డబల్ బెడ్ రూమ్ ఇల్లు,రాష్ట్ర ప్రభుత్వం అందించబోతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏర్వా శేఖర్ రెడ్డి,జెనిగే యాదయ్య,బొద్రమోని సత్తయ్య, మాజీ సర్పంచ్ మాణుపాటి యాదయ్య,తిరుమలేష్,గిన్నె మహేందర్,కారోబార్ రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**యూత్ అధ్యక్షునిగా అండేకర్ శంకర్**



**ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 27(సూర్యరేఖ)** యాచారం మండలం నందివనపర్తి గ్రామం జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ సీనియర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.యూత్ అధ్యక్షునిగా అండెకర్ శంకర్,ఉపాధ్యక్షులు హన్మంత్ రామకృష్ణ, జనరల్ సెక్రటరీ నెర్ర మల్లేష్,జాయింట్ సెక్రటరీ కేశమోని ధనుష్,ఆర్థిక కార్యదర్శి నూకం కృష్ణ, ఆటల కార్యదర్శులు గుణమోని రాఘవేందర్,ముక్తల శివ కృష్ణ ,సాంస్కృతిక కార్యదర్శులు సామ పవన్,ఎడ్ల పవన్,అడిటర్స్ నూకం రామస్వామి, సంగం గణేష్ కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ...యూత్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. నాపై నమ్మకంతో యూత్ అధ్యక్షుడిగా ఎన్నుకున్న యూత్ సీనియర్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.యూత్ నిబంధనలకు కట్టుబడి పనిచేసి జ్యోతి యూత్ కి మంచి పేరు తీసుకోస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కారులను విస్మరిస్తే మరో పోరాటం తప్పదు..




**తుర్కయంజాల్,అక్టోబర్27(సూర్యరేఖ)** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం దాదాపు పది సంవత్సరాలు పాటు ఉద్యమాలు చేసిన తెలంగాణ ఉద్యమకారులను విస్మరిస్తే కాంగ్రెస్ పార్టీ పైన మరో పోరాటం తప్పదని రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ కందాల బల్దేవ్ రెడ్డి అన్నారు. ఫోరం అధ్యక్షులు చీమ శ్రీనివాస్ రావు పిలుపుమేరకు జిల్లా అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ...ఉద్యమ నాయకుడిగా పేరు ప్రతిష్టలు సంపాదించి ఈ రాష్ట్రానికి 10 సంవత్సరాల పాటు సీఎంగా పనిచేసిన కేసీఆర్ కూడా ఉద్యమకారులను, మేధావులకు,విద్యార్థి లోకానికి సరియైన న్యాయం చేయకపోవడంతో కెసిఆర్ ను ఓడించిన చరిత్ర ఉద్యమకారులకు ఉందని వారు గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమ కారులకు 250 గజాల భూమిని కేటాయిస్తామని చెప్పడం జరిగిందని,ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమకారులు సొంత ఆస్తులు,భూములను విలువైన సమయాన్ని సర్వస్వం కోల్పోయి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడడం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.డిసెంబర్ 9 సోనియాగాంధీ పుట్టినరోజు లోపే ఉద్యమ కారుల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఏదో ఒక ప్రకటన చేయాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఉద్యమ తరహాలో మరో ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు జెనిగె విష్ణువర్ధన్, ఆర్గనైజింగ్ సెంటర్ నరేందర్ గౌడ్,బిజెపి రాష్ట్ర కోశాధికారి బచ్చిగల్ల రమేష్,దక్షిణ తెలంగాణ మహిళా విభాగ అధ్యక్షులు దుగ్గాని శ్యామల,నక్క జంగయ్య,గౌని వీరస్వామి గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిలో చేరిన మైనారిటీ సోదరులు..





**కామారెడ్డి,అక్టోబర్ 27( సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 20వ వార్డుకు చెందిన మైనార్టీ సోదరులు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరారు.అనంతరం మైనార్టీ సోదరులు మాట్లాడుతూ...కామారెడ్డి నియోజకవర్గం కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతుందని వారు అన్నారు.దేశం మొత్తం నరేంద్ర మోడీ నాయకత్వం వైపు చూస్తుందని,నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిందని వారు గుర్తు చేశారు.రానున్న ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపు నాకు కృషి చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## బారాస మాజీ ఎమ్మెల్యే సురేందర్ అరెస్ట్.



**కామారెడ్డి,అక్టోబర్ 27( సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం భారత రాష్ట్ర సమితి నాయకుడు మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాదులోని రాయదుర్గం ఓరియన్ విల్లాస్ లో కేటీఆర్ ఇంటి వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.కేటీఆర్ ఇంట్లోకి వెళుతున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకుడు జాజాల సురేందర్ ను పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసే క్రమంలో పోలీసులకు సురేందర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది సురేందర్ అరెస్టుపై భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పోలీసులు అరెస్టు చేసిన ప్రజల కోసం నిరంతరం పోరాడుతానని సురేందర్ అన్నారు.

## అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

**అరకేజీ గంజాయి స్వాధీనం..**




**రాజేంద్రనగర్,అక్టోబర్ 27** గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను ఎస్వోటీ పోలీసులు మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల సహకారంతో పట్టుకున్నారు.వారి వద్ద నుంచి అరకేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.వివరాల ప్రకారం. మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ అమ్మ గార్డెన్ సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నారు. విశ్వసనీయంగా సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు ముగ్గురు వ్యక్తులను ఎస్ఓటి పోలీసులు,మైలార్ దేవ్ పల్లి పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి సుమారుగా అరకేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. మూడు సెల్ ఫోన్లు,కొత్త నగదును స్వాధీనం చేసుకున్నారు.గంజాయి విక్రయిస్తున్న వారు దూల్ పేట్ కు చెందిన వ్యక్తులుగా పోలీసులు భావిస్తున్నారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నాలుగు చెరువులతో హైడ్రా పనులు మొదలు

**హైదరాబాద్ :** రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన హైడ్రా, తన పని తాను చేసుకుపోతోంది. రాబోయే ఆరునెలల్లో చేయబోయే టార్గెట్‌ను ఫిక్స్ చేసుకున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నాలుగు చెరువులను సుందరీకరణ చేయనుంది. ప్రస్తుతం ఆయా పనుల్లో బిజీ ఉంది.హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ–హైడ్రా దృష్టి పెట్టింది. ఓ వైపు ప్రభుత్వ భూములను కాపాడుతూనే మరోవైపు చెరువులను సుందరీకరణ చేయాలని నిర్ణయించుకుంది. తనను తానే టార్గెట్ ఫిక్స్ చేసింది.హైదరాబాద్ సిటీలో చెరువుల పూర్వభవానికి పైలెట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది.

## శివరాంపల్లి హిందీ ఉపాధ్యాయురాలిని వరించిన డాక్టరేట్..





**రూపాదేవి కృషిని అభినందించిన ఉపాధ్యాయులు, బంధువులు**

**రాజేంద్రనగర్,అక్టోబర్ 27** శివరాంపల్లికి చెందిన రూపాదేవి హిందీ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం రూపాదేవి శివరాంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు.' రాజేంద్ర యాదవ్ కె కథా సాహిత్య మే చేతనా కే ఆయాం' అనే అంశంపై డాక్టర్ రాజశ్రీ మోరే పర్యవేక్షణలో పరిశోధనలు పూర్తి చేయగా..ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం నుంచి డాక్టరేట్ పొందానని శారద తెలిపారు.ఈ సందర్భంగా శనివారం సహచర ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఆమెకు అభినందనలు తెలిపారు. పరిశోధనకు పూర్తి సహకారం అందించిన ఉపాధ్యాయులు,బంధుమిత్రులు,గైడ్లకు రూప ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**వంటేరు ప్రతాప్ రెడ్డి**

**సిద్ధిపేట,అక్టోబర్27(సూర్యరేఖ)** మృతుల కుటుంబాలను ఆదివారం గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పరామర్శించారు.కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామానికి చెందిన గట్టు కిషన్ ప్రమాదవశాత్తు పాముకాటుతో మృతి చెందాడు.అదేవిధంగా చిన్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన మలిపెద్ది శ్రీనివాస్ కూతురు శాస్త్రిక గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందింది విషయం తెలుసుకున్న వంటేరు ప్రతాప్ రెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పి మనోధైర్యాన్ని కల్పిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.వారి వెంట రాష్ట్ర వైస్ ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు దేవి రవీందర్,చిన్న కిస్టాపూర్ మాజీ సర్పంచ్ కనకయ్య,వైస్ ఎంపీపీ భగవాన్,మాజీ సర్పంచ్ రాజగౌడ్,నరేందర్ రెడ్డి,దుర్గ రెడ్డి,గోపాల్ రెడ్డి, సంతోష్ చారి,మల్లారెడ్డి,బాల మల్లు రాజు, ఈగ స్వామి,గ్రామస్తులు,తదితరులున్నారు.

## దేశ అభివృద్ధి పరమావధిగ కొనసాగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం





**మండల బిజెపి ఉపాధ్యక్షుడు బండమీది వెంకటయ్య**

**శంకర్ పల్లి,అక్టోబర్27(సూర్యరేఖ)** దేశ అభివృద్ధి ధ్యేయంగా కొనసాగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలని శంకర్ పల్లి మండలం ఉపాధ్యక్షుడు బండమీద వెంకటయ్య అన్నారు.శంకర్ పల్లి మండల పరిధి ప్రొద్దుటూరు గ్రామంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలు అభివృద్ధి ధ్యేయంగా భారత ప్రధాని దేశాన్ని ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా అభివృద్ధి పనులను భారత ప్రధాని కొనసాగిస్తున్నాడని వెల్లడించారు. 370 ఆర్టికల్, త్రిపుల్ తలాక్,జాతీయ రహదారులు, మరుగుదొడ్లు, స్మశాన వాటికలు,కిసాన్ సన్మానిధి,నదుల ఆధునికరణ,ఆయుష్మాన్ భారత్,బేటి బచావో,బేటి పడావో ఇలా చెప్పుకుంటూ పోతే దేశ అభివృద్ధి విషయంలో ముందుకు వెళుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు రాములు గౌడ్, సీనియర్ నాయకులు నవీన్ కుమార్,మాజీ ఎంపీపీ నర్సింలు,ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, బయన్న, నరసింహారెడ్డి, సంజీవరెడ్డి, సుధాకర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, రాజు,గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కోటి పార్థివ లింగాల వాహనానికి ప్రత్యేక పూజ




**చేగుంట,అక్టోబర్ 27(సూర్యరేఖ)** చేగుంట కాశీలో కోటి పార్దివ లింగాల నిమజ్జన కార్యక్రమంలో చేగుంట గ్రామం భక్తులు స్వహస్తాలతో తయారుచేసిన లింగాల వాహనం కాశీ యాత్రకు ఆధివారం బయలుదేరింది.శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నుండి భక్తులందరూ వాహనానికి పూజ చేసి రథానికి హారతులు ఇచ్చి తీర్థ ప్రసాదం స్వీకరించి శివ అనుగ్రహానికి పొంది.వైశ్య సంఘ సభ్యులు,వాసవి మహిళ సభ్యులు,శివ భక్తులు అందరు వాహనానికి మంగళ హారతులతో పూజలు చేసి కాశీకి పంపించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు తడుపులూరి నాగరాజు,మంచి కట్ల శ్రీనివాస్, అయిత పరంజ్యోతి,జూకంటి రజాగౌడ్,కూన సంతోష్, నాగభూషణం, చందు, శంకర్, నంగనూరి శీను,ఎర్రం శంకర్,టి హనుమయ్య,అయిత రామలింగం,గోలి మహేష్, టి.శ్రీనివాస్,టి మహేష్,మాశెట్టి నాగభూషణం,వెంకటేశం,బాలేశం,అల్లంకి చంద్రమౌళి, ఎర్రము మహేష్,మెదక్ రాములు,వాసవి మహిళా సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి..

**కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్**



**రాజేంద్రనగర్,అక్టోబర్ 27(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ... పార్టీ నాయకులు సమన్వయంతో పని చేసి డివిజన్లో అభివృద్ధి పథంలో నడిపించుకుందామన్నారు. దక్షిణ కొరియా పర్యటనలో ఎన్నో విషయాలను తెలుసుకోవడం జరిగిందన్నారు.అక్కడ పరిస్థితులను అవఘతం చేసుకొని,అభివృద్ధి చేపట్టడానికి కావాల్సిన వనరులు,వాటి సమృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై దృష్టి గురించి తెలుసుకున్నామన్నారు.ఈ మేరకు నియోజకవర్గంలోనూ ఆ మోడల్ అభివృద్ధి చేపట్టేలా కార్యాచరణను రూపొందించుకొని పని చేస్తామన్నారు.ఈ మేరకు అందరూ కలిసి పని చేయాలన్నారు.ప్రేమావతి పేట్,వాంబే కాలనీ, ఆపోకాలనీ,మార్కండేయనగర్,సాయిబాబానగర్ కాలనీ,బాబుల్ రెడ్డి నగర్ కాలనీలోని కాంగ్రెస్ కార్యకర్తలు,సీనియర్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పార్టీలో ఉన్న పాత,కొత్త నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి డివిజన్ అభివృద్ధి పథంలో నడిపించుటకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## హిందూ దేవాలయాలపై జరిగిన దాడికి నిరసన ర్యాలీ..



**సిద్దిపేట,అక్టోబర్27(సూర్యరేఖ)** ఇటీవల సికింద్రాబాద్ లో ముత్యాలమ్మ దేవాలయంలో జరిగిన సంఘటనకు నిరసనగా ఆదివారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.హిందువులు,హిందూ దేవాలయాలపై దాడులకు నిరసనగా కుకునూరుపల్లి మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ బిజెపి హైందవ సంఘాల ఆధ్వర్యంలో కుకునూరు పల్లి రామాలయం నుండి పెద్దమ్మ దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు పాములపర్తి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఇప్పటి నుండైనా మన హిందువులంతా ఐక్యతగా ఉండి మన హిందువులు,హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను తిప్ప కొట్టడానికి మన హిందూ సమాజమంతా సంఘటతమై ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కుకునూరు పల్లి మండల అధ్యక్షుడు నందకిషోర్ శర్మ,హైందవ సోదరులు పాల్గొన్నారు.

## తొట్టేల ఫంక్షన్ కు హాజరైన మాజి ఎంపీపీ



**చేగుంట,అక్టోబర్27(సూర్యరేఖ)** మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో పుట్ట మహేష్ తమ్ముడు పుట్ట రాజు కొడుకు తొట్టేల ఫంక్షన్ కు చేగుంట మాజి ఎంపీపీ మాసుల శ్రీనివాస్ హాజరైన ఆశీర్వదించారు.ఈ కార్ర్యమంలో మహేష్, జానీ గౌడ్, వేణు, అరవింద్,శ్రీను,సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI Title -Code :TELTEL 12276 Cell No.9397303326,